క్లుప్తంగా

ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఐదో విడత ప్రవేశాలు

• 16లోపు దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఐదో విడత ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టీవీ గిరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీఓవి.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 16 మధ్యాహ్నం 2గంటలలోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు పూర్తయిన వెంటనే వచ్చే యూనిక్ నెంబర్‌ను ఉపయోగించి అదే తేదీ సాయంత్రం 4 గంటలలోపు సమీపంలోని ఏదైనా ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐకి ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెళ్లి వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 17 ఉదయం 9 గంటలకు సంబంధిత ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐలలో నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9441518355, 9849944654 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ ఐటీఐలో సోలార్, ఐటీ ల్యాబ్‌ల ప్రారంభం

విజయనగరం అర్బన్: పట్టణంలోని వీటీఅగ్రహారంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం సోలార్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే పి.అదితివిజయలక్ష్మి గజపతిరాజు ప్రారంభించారు. హైదరాబాద్‌లోని అద్విక్ ఫౌండేషన్ సంస్థ సీఎస్ఆర్ నిధుల కింద సుమారు రూ.7 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి మాట్లాడుతూ సోలార్ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించి భవిష్యత్‌లో వారికి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అద్విక్ ఫౌండేషన్ తరఫున ఎండీ రవి, కమల్ పాల్గొన్నారు. అనంతరం ఐటీఐ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన 'కాన్వకేషన్–2025' కార్యక్రమంలో ఏఐటీటీ – 2025 పరీక్షల్లో 600 మార్కులు సాధించిన ఎలక్ట్రికల్ విద్యార్థి ఇ.సాయిని సర్టిఫికెట్, మెడల్, మొమెంటోతో సత్కరించారు. ప్రతి ట్రేడ్‌లో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కూడా సర్టిఫికెట్లు, మొమెంటోలు అందజేశారు.

డ్రగ్స్ బారిన పడొద్దు..



పాఠశాలలో డ్రగ్స్ వద్దు బ్రో చైతన్య కార్యక్రమం

విజయనగరం క్రైమ్: మాదకద్రవ్యాల బారిన పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఈగల్ బృందం ఆధ్వర్యంలో జొన్నవలస జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా హెడ్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో పలువురు మాట్లాడుతూ విద్యార్థులు మంచి అలవాట్లతో చక్కగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈగల్ టీమ్ హెడ్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఐజీ ఆకే రవికృష్ణ ఆదేశాల మేరకు సీఐ కల్యాణి సూచనలతో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, వెంకటేష్, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏఆర్ వింగ్ ఆధీనంలో ఉండే పోలీసు వెల్ఫేర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్టు ఎస్పీ దామోదర్ సోమవారం తెలిపారు. ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తమ విద్యార్హతతో పాటు కచ్చితంగా ఆంగ్ల సబ్జెక్టును బోధన చేయగలిగిన సామర్థ్యం ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 16న ఉదయం పది గంటలకు విజయనగరం కంటోన్మెంట్ పోలీసు క్వార్టర్స్ సమీపంలోని పోలీసు వెల్ఫేర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జరిగే ఇంటర్వ్యూలకు, డెమో క్లాసులకు నేరుగా హాజరు కావాలన్నారు. వివరాలకు 6305883484, 9441022875, 9121109485, 9121109484 నంబర్లను సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

వితరణ

డెంకాడ: మండలంలోని కె.కొల్లాంలో విజయనగరానికి చెందిన మహేశ్వరి మహిళా సమితి ప్రతినిధులు గ్రామస్తులకు స్వీట్లు, దీపావళి మతాబులు వితరణగా అందజేశారు. అలాగే పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించారు. కార్యక్రమంలో మహిళా సమితి అధ్యక్షురాలు చందా మోడీ, సెక్రటరీ సంతోష్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ – చిల్లపేట గ్రామాల మధ్య ఉన్న రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అతిథిగజపతిరాజు సోమవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.1.90 కోట్ల అంచనా వ్యయంతో మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, దీంతో రెండు గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ పాలవలస యశస్వి, ఎంపీడీవో గంటా వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం విక్రయాలపై..
కదంతొక్కిన మహిళలు



నెల్లిమర్లలో నకిలీ మద్యం అమ్మకాలకు వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

• వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ
• నకిలీ మద్యం దందాపై సీబీఐతో దర్యాప్తు చేపట్టాలని డిమాండ్



నకిలీ మద్యంను అరికట్టాలంటూ విజయనగరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

విజయనగరం రూరల్/నెల్లిమర్ల: చంద్రబాబు సర్కారు నకిలీ మద్యం దందాపై మహిళలు కదంతొక్కారు. రాష్ట్రంలో ఇటీవల బట్టబయలైన నకిలీ మద్యం దందా, కల్తీ మద్యంపై వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గ కేంద్రాల్లో సోమవారం ఆందోళనలు చేశారు. నకిలీ మద్యం విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడొద్దంటూ నినదించారు. ప్రభుత్వ తీరుపై ప్లకార్డులతో నిరసన తెలిపారు.

విజయనగరం నియోజకవర్గంలో ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి, విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న 60 వార్డుల్లోని మహిళలు, రూరల్ మండలం పరిధిలోని పలు గ్రామాల మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు. రాష్ట్రంలో మద్యం దుకాణాలను ప్రైవేటుకు అప్పగించడంతో వీధివీధిన, గ్రామగ్రామాన బెల్టు దుకాణాలు, పర్మిట్ రూంలు వెలిశాయని, మహిళల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందంటూ వాపోయారు. సెయింట్ మేరీస్ పాఠశాల కూడలి నుంచి బొగ్గులదిబ్బ ప్రాంతంలో ఉన్న ఎక్సైజ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి, నకిలీ మద్యం విక్రయాలు అరికట్టాలంటూ సీఐ కె.మన్మథ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.



ఎక్సైజ్ అధికారికి వినతిపత్రాన్ని అందిస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు



ప్లకార్డులతో మహిళల నిరసన

ధనార్జనే ధ్యేయంగా...

అనంతరం కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ 16 నెలల చంద్రబాబు సర్కారు అబద్ధపు హామీలతో గద్దెనెక్కి ప్రజలను వంచించిందన్నారు. గత జగనన్న పాలనలో ఎంతో పారదర్శకంగా, ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలను నిర్వహిస్తే, చంద్రబాబు సర్కారు ధనార్జనే ధ్యేయంగా మద్యం విధానాన్ని ప్రైవేటుపరం చేసిందన్నారు. దీంతో దోపిడీకి తెరలేచి, అధిక మొత్తంలో ముడుపులు చేతులు మారుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చిత్తూరు, నెల్లూరు, ఏలూరు, విజయవాడ, పాలకొల్లు, పరవాడ, తదితర ప్రాంతాల్లో కల్తీ మద్యం దందా బయటపడిందన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా చిత్తూరులోని ములకల చెరువు, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో నకిలీ మద్యం దందా కుటీర పరిశ్రమనే తలపించడం విస్మయానికి గురిచేస్తోందన్నారు. రాష్ట్రంలో మద్యం దుకాణాలు గుడి, బడి, ప్రధాన రోడ్లకు ఆనుకుని ఉన్నాయని, వెంటనే వాటి లైసెన్సులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మద్యం ఏరులై పారించి, మహిళల తాళిబొట్లపై చంద్రబాబు సర్కారు ఊయల ఊగుతోందని మండిపడ్డారు. కల్తీ మద్యం తయారీ, మరణాలపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గదుల సత్యవతి, విజయనగరం పట్టణ అధ్యక్షురాలు పిన్నింటి కళావతి, కార్పొరేటర్లు సంతోషి, పద్మావతి, దుప్పాడ సునీత, పట్టా ఆదిలక్ష్మి, బోనుల ధనలక్ష్మి, దాసరి సత్యవతి, రేగాన రూపదేవి, నాగవల్లి, పార్టీ కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్నారు

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో విచ్చలవిడిగా కల్తీ మద్యం విక్రయిస్తూ ప్రజల ప్రాణాలు తీస్తోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు నెక్కల నాయుడుబాబు ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల మండల, పట్టణ అధ్యక్షులు గదల సన్యాసినాయుడు, చిక్కాల సాంబశివరావు ఆధ్వర్యంలో కల్తీ మద్యంపై నెల్లిమర్ల ఎక్సైజ్ స్టేషన్ వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎక్సైజ్ సీఐ వెంకటరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయుడుబాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వ మద్యం షాపుల ద్వారా నాణ్యమైన మద్యం విక్రయించామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత వేలంపాట ద్వారా మద్యం షాపులు కేటాయించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసి బెల్టు షాపుల ద్వారా మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారన్నారు. నకిలీ మద్యం కేసులో టీడీపీ నాయకులు అడ్డంగా దొరికిపోయి, దానిని ఎస్సార్‌సీపీ నాయకులపై నెట్టడానికి చూస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పేద ప్రజలకు వైద్యం, వైద్య విద్యను అందుబాటులోకి తేవడానికి 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేస్తే వాటిని ప్రైవేటీకరణ చేయడానికి కూటమి ప్రభుత్వం కొత్తగా జీఓ జారీచేయడం విచారకరమన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా ఒక్క మెడికల్ కళాశాలను కూడా పూర్తి చేయలేదన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ భోగాపురం, డెంకాడ మండలాల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, పిన్నింటి తమ్మునాయుడు, వైస్ ఎంపీపీలు సారిక వైకుంఠం, పతివాడ సత్యనారాయణ, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, పార్టీ ఎస్సీఎల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధికార ప్రతినిధి దవళ లక్ష్మణరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిక్కాల అరుణ కుమారి, కౌన్సిలర్లు చిక్కాల సంతోష్ కుమార్, చిక్కాల సుమతి, బూర సుజాత, సీనియర్ నాయకులు దంతులూరి గిరిబాబు, మత్స సత్యనారాయణ, సుందర హరీష్, కోట్ల పైడినాయుడు, మజ్జి గణేష్, చిక్కాల రవి, కనకల హైమావతి, మజ్జి సుమ తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో వైద్య సిబ్బంది నిరసన



వైద్యాధికారులకు మద్దతుగా నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టిన వైద్య సిబ్బంది

భోగాపురం: గత కొన్ని రోజులుగా తమ సమస్యలు పరిష్కారం కోరుతూ సమ్మె చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారులకు సోమవారం వైద్య సిబ్బంది మద్దతు పలికారు. సోమవారం భోజన విరామ సమయంలో పోలిపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా వైద్యాధికారుల సమ్మెకు వైద్య సిబ్బంది సంఘీభావం తెలిపింది. కార్యక్రమంలో సీహెచ్‌వో జయకుమారి, పబ్లిక్ హెల్త్ నర్సు సావిత్రి, హెల్త్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, బి.కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, స్టాఫ్‌నర్సు ప్రశాంతి, పి.కృష్ణవేణి పాల్గొన్నారు.

డెంకాడలో..

డెంకాడ: గత కొన్ని రోజులుగా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్న ప్రభుత్వ వైద్యులకు మద్దతుగా సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో డెంకాడ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి పీహెచ్‌సీ ముందు నిరసన వ్యక్తం చేశారు. వైద్యాధికారుల డిమాండ్ల విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకుని పరిష్కరించాలని ఏపీఎన్‌జీవో భోగాపురం తాలూకా అధ్యక్షులు కొమ్మూరు దుర్గారావు కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



డెంకాడ: సీహెచ్‌సీ ముందు నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

రుషికొండ ప్యాలస్‌ను మ్యూజియంగా తీర్చిదిద్దాలి

విజయనగరం టౌన్: విశాఖ రుషికొండ ప్యాలెస్‌ను శాస్త్ర, సాంకేతిక, సాంస్కృతిక మ్యూజియంగా తీర్చిదిద్దాలని యువ సమ్మేళనం ప్రతినిధులు కె.అభిమన్యు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో దీనికి సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రూ.వందల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన భవనం వృథా కారాదన్నారు. వ్యాపార కేంద్రంగా వినియోగించడం వలన ప్రయోజనకరంగా ఉండదని, అందుకు ఎన్నో అవకాశాలున్నాయన్నారు. భావి యువతకు, విద్యార్థులకు విజ్ఞాన మార్గదర్శిగా నిలపాలన్నారు. ఆంధ్ర రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను, చరిత్రను చాటిచెప్పే వేదిక కావాలన్నారు. రాజకీయ అవసరాలకు రచ్చ చేయకుండా, స్వార్థ ప్రయోజనాలకు వినియోగించకుండా జాతికి అంకితం చేయాలన్నారు. మ్యూజియం ఏర్పాటుకు మద్దతునిచ్చే ప్రజలు తమ అభిప్రాయాలను రుషికొండ ఎట్‌ది రేట్ ఆఫ్ ఏపిడిటిసి డాట్ ఇన్‌కు అక్టోబరు 17లోపు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు ప్రశాంత్, శ్రీకాంత్, దివ్య, ఇషాక్, తేజ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యువ సమ్మేళనం ప్రతినిధులు

అలరించిన అన్నమాచార్య కీర్తనలు



అన్నమాచార్య కీర్తనాలాపన చేస్తున్న డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి చదురుగుడి ప్రాంగణంలో ఉన్న ఆధ్యాత్మిక కళావేదికపై రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, వంగిపురం రామానుజాచార్య పురస్కార గ్రహీత, రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్నేటి స్వప్నహైందవి నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తనాలాపన అలరించింది. కంచికామకోటి పీఠం ఆస్థాన విద్వాంసులు డాక్టర్ మండపాక రవి మృదంగం పైన, రామ్‌చరణ్ వయోలిన్‌పై సహకారమందించారు. అనంతరం ఆలయ అధికారులు దుశ్శాలువతో కళాకారులను ఘనంగా సత్కరించారు.

ఎన్‌సీసీ బాలుర విభాగం ఎంపికల పూర్తి



ఎంపికైన ఎన్‌సీసీ క్యాడెట్లతో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్లు

విజయనగరం అర్బన్: పట్టణంలోని తోటపాలెం పరిధిలో గల సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల బాలుర ఎన్‌సీసీ విభాగం ఎంపిక కార్యక్రమం సోమవారం స్థానిక అయోధ్య మైదానంలో ముగిసింది. 13(ఏ) బాలుర బెటాలియన్ విశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న అభ్యర్థులకు 1600 మీటర్ల పరుగు, సిటప్‌లు, పుష్‌అప్‌లు, 100 మీటర్ల స్ప్రింట్, ఎత్తు, బరువు, కంటిచూపు తదితర పరీక్షల ద్వారా శారీరక నైపుణ్యాలను పరిశీలించి అనంతరం వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 100 మంది సత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈ ఎంపికలో పాల్గొన్నారు. బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్‌లు కల్నల్ నీరజ్ కుమార్, సుబేదార్ దేవేందర్ సింగ్, హవల్దార్ ఆనంద్ సింగ్, హవల్దార్ రాం ప్రసాద్, హవల్దార్‌ల, జీసీఎల్ దివ్యదుర్గా పాల్గొని పర్యవేక్షించారు. విద్యార్థులలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు మరియు దేశభక్తి పట్ల ఆసక్తిని పెంపొందించడమే ఈ ఎంపిక శిబిరం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ఎస్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ ఎం.ఉదయ్‌కిరణ్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

నెల్లిమర్ల: అన్యాయంగా తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోకపోతే పోరాటం తప్పదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ హెచ్చరించారు. సోమవారం స్థానిక సీహెచ్‌సీ వద్ద ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఆసుపత్రిలో మౌలిక వసతులు లేవని, ప్రహరీ కూలిపోయిందని, ప్రధాన రహదారి గేటు విరిగిపోయిందన్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలన్నారు. తొలగించిన కార్మికులను కొనసాగించాలని, జీతాలు పూర్తిగా చెల్లించాలని, సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు మొయిద పాపారావు, శానిటేషన్, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

మహిళల రక్షణ కోసమే శక్తి యాప్

విజయనగరం లీగల్: ప్రతీ ఒక్కరూ శక్తి యాప్‌ను వారి మొబైల్‌ఫోన్‌లో డౌన్ లోడ్ తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత అన్నారు. మహిళల రక్షణ కోసం సోమవారం జిల్లా కోర్టులో పని చేస్తున్న మహిళా సిబ్బందికి న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా మహిళలు ఎక్కడ ఏ పరిస్థితుల్లో ఉన్నప్పటికీ అత్యవసర రక్షణ లేదా సహాయం కావాలంటే ఈ యాప్‌ను వినియోగించి వారికి పోలీస్ శాఖ ద్వారా రక్షణ అందుతుందన్నారు. విజయనగరం మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.నరసింహమూర్తి, మహిళా పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ శిరీష యాప్ డౌన్‌లోడ్ ఎలా చేసుకోవాలో, ఏ విధంగా వినియోగించుకోవాలన్నది తర్ఫీదు ఇచ్చారు. అదే విధంగా బాల బాలికలు మిస్సింగ్ అయినా ఈ యాప్ ద్వారా రక్షణ పొందవచ్చునన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

అర్హత ఉన్నా.. అంతులేని నిర్లక్ష్యం..!

• ఏడాదిన్నర అవుతున్నా.. పట్టించుకోని కూటమి ప్రభుత్వం
• సామాజిక పింఛన అందక లబోదిబోమంటున్న వృద్ధులు
• ఆవేదన చెందుతున్న దివ్యాంగులు, వితంతువులు



పూసపాటిరేగ మండల పరిషత్ కార్యాలయం

పూసపాటిరేగ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటుతున్నా.. కొత్త పింఛన్లు మంజూరుకు నోచుకోలేదు. అర్హత ఉన్నా దరఖాస్తు చేసుకోవడానికి కనీసం వెబ్‌సైట్ తెరవలేదు. అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు నెలలుగా పింఛన్లు మంజూరు కాక ఆశతో ఆకలితో ఎదురు చూస్తున్నారు. భర్త చనిపోతే అదే నెలలో స్పౌజ్ కోటాలో అనుమతిచ్చి, ఏడాదిన్నర క్రితం భర్త చనిపోయి ఎటువంటి ఆదరణకు నోచుకోని మహిళలు పింఛన్‌కు నోచుకోకపోవడంపై పలువురు వాపోతున్నారు. వందల సంఖ్యలో వితంతువులకు పింఛన్ అందక కనీసం మందులు ఖర్చు అయినా లేక అల్లాడుతున్నారు. గతంలో పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి వలంటీర్లు దరఖాస్తు చేసిందే తడవుగా పింఛన్ మంజూరయ్యేది. ఇప్పుడు పరిస్థితి చూస్తే సంక్షేమ పథకాలు దేముడెరుగు కనీసం సామాజిక పింఛన్లు అయినా మంజూరు చేయకపోవడంపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలోనే సుమారు రెండు వేల మంది అర్హులైన పింఛన్‌దారులు వున్నారు. పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల మండలాలలో ఇప్పటికే మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ వందలాది మంది అర్హులైన వారందరు ప్రదక్షణ చేస్తున్నారు. పూసపాటిరేగ గ్రామంలో భర్త చనిపోయి ఏడాది దాటిన పిల్ల బుచ్చమ్మ, బెల్లాన రాములమ్మ మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మంజూరైన పింఛన్ ఇవ్వలేదు..

కుమిలి గ్రామంలో స్పౌజ్ కోటాలో పింఛన్ మంజూరైన గొంప తోటమ్మ, మడిపల్లి సూరమ్మ, కేత లక్ష్మి, ఎడ్లపల్లి లక్ష్మి, పల్లి పాపాలకు పింఛన్ మంజూరైనట్టు చెప్పారు. తీరా సచివాలయానికి పింఛన్‌కి రమ్మని చెప్పి వెళ్లాక పింఛన్ వెబ్‌సైట్‌లో ఓపెన్ కావడం లేదని వెనక్కి పంపేశారు. ఇలా అర్హత వున్న ఎంతో మంది పింఛన్‌కు నోచుకోక ఇబ్బందులు పడుతున్నారు. పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయానికి వెళ్లినా వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని వెనక్కి పంపిస్తున్నారు. గతంలో పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి నిరంతరాయంగా వెబ్‌సైట్ ఓపెన్ అయి వుండేది. కాని నేటి పరిస్థితి చూస్తే భిన్నంగా వుంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అర్హులకు పింఛన్‌లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

నా మొర దేవుడు ఆలకించడం లేదు..



నాది పూసపాటిరేగలోని భూడి వీధి. నా భర్త పిల్ల బంగారప్పడు ఏడాదిన్నర క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి కనిపించిన ప్రతి ఒక్క అధికారిని, ప్రజాప్రతినిధిని పింఛన్ మంజూరు చేయాలని వేడుకుంటున్నాను. నా మొర దేవుడు ఆలకించడం లేదు. వృద్ధాప్య పింఛన్, వితంతు పింఛన్‌కు అర్హత వుంది. కనీసం ఒక్క పింఛన్ కూడా మంజూరు కాలేదు. కూటమి పుణ్యమా అని ఇక పింఛన్ కోసం తిరగడానికి శక్తి సన్నగిల్లింది.

– పిల్ల బుచ్చమ్మ, భూడి వీధి, పూసపాటిరేగ

కనికరించరా...

నాది పూసపాటిరేగ గ్రామం. నిరుపేద కుటుంబానికి చెందిన మాకు ఎటువంటి ఆదరణ లేదు. నా భర్త బెల్లాన బుల్లి మరణించి ఏడాదిన్నర దాటింది. నాకు వితంతు పింఛన్, వృద్ధాప్య పింఛన్‌కు అర్హత వుంది. కాని ఒక్క పింఛన్ కూడా మంజూరు కాలేదు. కనిపించిన అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకొన్నా నాకు ఫలితం దక్కలేదు. దిక్కులేని కుటుంబాలకు దేవుడైనా దిక్కు అనుకొంటే ఆశ సన్నగిల్లింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అర్హత ఉన్నా పింఛన్ దక్కలేదు.

– బెల్లాన రాములమ్మ, రాజావీధి, పూసపాటిరేగ

ధర్నాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి

విజయనగరం క్రైమ్: విజయనగరం పోలీసు సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా సెక్షన్ 30 పోలీసు చట్టాన్ని ఈ నెల 13 నుంచి నవంబరు 11 వరకు అమలు చేస్తున్నట్టు విజయనగరం ఇన్‌చార్జ్ డీఎస్పీ ఆర్.గోవిందరావు సోమవారం తెలిపారు. సెక్షన్ 30 చట్టం అమల్లో ఉన్నందున పోలీసు శఖాఖ అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమన్నారు. పోలీసు శాఖ నుంచి ముందస్తు అనుమతులు తీసుకోకుండా ఎటువంటి ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టడం చట్టవిరుద్ధమన్నారు. ముందస్తు అనుమతులతోనే నిరసన కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

17, 18 తేదీల్లో విద్యార్థులకు ఆటల పోటీలు

భోగాపురం: మండల కేంద్రంలో పాఠశాల విద్యా కమిషనర్, జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలతో ఈ నెల 17, 18న అండర్–14, 17లకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించనున్నట్టు మండల విద్యాశాఖాధికారి రమణమూర్తి తెలిపారు. వాలీబాల్, షటిల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ తదితర పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు.